క్లుప్తంగా

రోగులకు భోజనం పెట్టేందుకు టెండర్లు

గుంటూరు మెడికల్: తెనాలి జిల్లా ఆస్పత్రిలో రోగులు, డ్యూటీలో ఉండే వైద్యులకు భోజనం పెట్టేందుకు అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థల నుంచి సీల్డ్ టెండర్లు ఆహ్వానించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఎం.మజీదాబి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3 నుంచి 14వ తేదీ వరకు గుంటూరు పట్టాభిపురంలోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో రూ.వెయ్యి చెల్లించి టెండరు ఫారం పొందాలన్నారు. టెండరు ఫారాలను పూర్తి చేసి 17వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు గుంటూరులో డీసీహెచ్ఎస్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. జాయింట్ కలెక్టర్, జిల్లా డైట్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ భార్గవ్ తేజ ఆధ్వర్యంలో డైట్ టెండర్లు 17వ తేదీ ఓపెన్ చేస్తారని వెల్లడించారు.

పేరేచర్ల నుంచి విజయవాడకు బస్సు సర్వీసు

పట్నంబజారు: ప్రయాణికుల సౌకర్యార్థం పేరేచర్ల నుంచి గుంటూరు మీదుగా విజయవాడకు బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ తెలిపారు. మంగళవారం ఆర్టీసీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. గతనెల 27 నుంచి పల్లెవెలుగు సర్వీసులు పేరేచర్ల నుంచి పెదపలకలూరు, విజ్ఞాన్ కాలేజ్, గుజ్జనగుండ్ల, కోరిటిపాడు, లాడ్జిసెంటర్ మీదుగా బస్సు సర్వీసు నడపనున్నట్లు చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి గంట వ్యవధిలో ఒక బస్సును ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు.

వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి



నెహ్రూనగర్: ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ ధరించాలని సవితా నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాంబయ్య పేర్కొన్నారు. బ్రాడీపేటలోని సవిత నాయీబ్రాహ్మణ సంఘం(బీఎంఎస్) కార్యాలయంలో మంగళవారం హెల్మెట్ ధరించడం సామాజిక బాధ్యత అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సాంబయ్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో హెల్మెట్ లేకపోవడం వలన ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారని చెప్పారు. పలు పనుల నిమిత్తం చుట్టుపక్కల గ్రామాల నుంచి ద్విచక్ర వాహనాలపై వస్తుంటారని వివరించారు. అలాంటి వారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని తెలిపారు. హెల్మెట్ ధరించి సమాజానికి ఆదర్శప్రాయం ఉండాలని కోరుతూ సెలూన్ షాపుల్లో వర్కర్లకు ఉచితంగా హెల్మెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి సాంబ, జిల్లా కోశాధికారి జాజాల ధనబాబు, జిల్లా సలహా దారులు పరిటాల శ్రీకృష్ణ, సభ్యులు మున్నంగి శివనాగమల్లేశ్వరరావు, అద్దేపల్లి నాగేశ్వరరావు, ఇనపగుర్తి అయ్యప్ప, యర్రవరపు బాలమనోజ్, కటారి అనిల్ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తుల పరిశీలన

నెహ్రూనగర్: సబ్సిడీ రుణాల మంజూరు కోసం దరఖాస్తులు 3, 4 తేదీల్లో పరిశీలించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్మెంట్ – మోనిటరింగ్ సిస్టం (ఓబీఎంఎంఎస్)లో తూర్పు నియోజకవర్గంలో ఈ నెల 3వ తేదీ బ్రహ్మనందరెడ్డి స్టేడియం, పశ్చిమ నియోజకవర్గంలో 4వ తేదీ ఎన్టీఆర్ స్టేడియంలో, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 7వ తేదీ అమరావతి రోడ్ నవీన స్కూల్‌లో పరిశీలన క్యాంప్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కాపీ, విద్యార్హత, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్ బుక్, పాన్ కార్డ్, ఆధార్ కార్డ్‌ల జిరాక్స్ కాపీలు, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫొటోతో నిర్దేశించిన క్యాంప్‌లకు హాజరు కావాలని కోరారు.

ఉర్దూ బాలుర కాలేజీ, హైస్కూల్లో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరు నందివెలుగురోడ్డులోని ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఉర్దూ బాలుర జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థులు ఈనెల 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని ప్రిన్సిపాల్ పి.సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ కళాశాలలో సీట్లను ఏపీఆర్‌జేసీ సెట్ ద్వారా భర్తీ చేస్తామని, ఉన్నత పాఠశాలలో 5వ తరగతితో పాటు 6,7,8 తరగతుల్లో ఖాళీల భర్తీ కోసం ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ సైట్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. ఇతర వివరాలకు 87126 25073, 96525 69140 నంబర్లో సంప్రదించాలని కోరారు.

పారిశుద్ధ్య విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

కమిషనర్ శ్రీనివాసులు



ప్రజారోగ్య అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం సహించబోమని, నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కృష్ణ నగర్, అశోక్ నగర్, కోబాల్ట్‌పేట, లక్ష్మీపురం, లాలాపేట తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మెరుగైన పారిశుద్ధ్య పనుల కోసం కార్మికుల రేషనలైజేషన్, ప్రత్యేకంగా అదనపు కార్మికులు, వాహనాలు, పుష్ కాట్స్ అందుబాటులో ఉంచినట్లు వివరించారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో సిబ్బంది, కార్యదర్శుల నిర్లక్ష్యం వలన పలు ప్రాంతాల్లో డంపింగ్ పాయింట్స్ ఉంటున్నాయని పేర్కొన్నారు. ప్రజల నుంచి పారిశుద్ధ్య పనుల లోపంపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఇన్‌స్పెక్టర్ తమ డివిజన్‌లో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా, సేకరించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించేలా పర్యవేక్షణ చేయాలని కోరారు. కార్మికులు, కార్యదర్శులు అత్యవసరమైతే తప్ప ముందస్తు అనుమతులు లేకుండా సెలవులు తీసుకోరాదని చెప్పారు. కార్మికులు ఉదయం ఇంటింటి చెత్త సేకరణ, మధ్యాహ్నం డ్రెయిన్లు శుభ్రం చేయాలన్నారు. మధ్యాహ్నం డ్రెయిన్‌లు శుభ్రం చేయడం లేదని పలు ఫిర్యాదులు అందుతున్నాయని, ఇక మధ్యాహ్నం సమయంలో ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. ఎస్ఎస్‌లు ప్రతి రోజు ఒక డివిజన్‌లో సమగ్ర పారిశుద్ధ్య పనులు జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పర్యటనలో ఎస్ఎస్ రాంబాబు, బయాలజిస్ట్ రామారావు పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికుల కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 60 సంవత్సరాలు నిండాయని 103 మంది పారిశుద్ధ్య కార్మికులు, 39 మంది ఇంజినీరింగ్ కార్మికులను బాధ్యతల నుంచి తొలగించారని, వారి స్థానంలో ఆ కుటుంబాలకు చెందిన వారిని తీసుకుని ఆదుకోవాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన తెలియచేసి నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ 20 నుండి 25 సంవత్సరాలు పని చేసిన కార్మికులను ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా ఇంటికి పంపిస్తున్నారని, దీంతో ఆ కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని, ఎవ్వరూ చేయలేని పని మున్సిపల్ కార్మికులు చేస్తున్నారని, వారు చేసే పనిని దృష్టిలో పెట్టుకొని మానవతా దృక్పథంతో వారి కుటుంబ సభ్యులను పనిలోకి తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో ఇలానే రిటైర్మెంట్ చేసిన వారి కుటుంబ సభ్యులను పనిలోకి తీసుకున్నారని, ఇప్పుడు కూడా అలాగే తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ స్పందిస్తూ మరణించిన కార్మికులు కుటుంబ సభ్యులను పనిలోకి తీసుకునేందుకు పై అధికారులకు నివేదించానని, రిటైర్మెంట్ అయిన వారి విషయంలో ప్రభుత్వ ఆదేశాలు లేనందున వారి కుటుంబ సభ్యులను పనిలోకి తీసుకోవటం కుదరని వివరించారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, నాయకులు కాళంగి భాగ్యరాజు, బ్రమరాంబ, మంత్రి నాగేశ్వరరావు, తమ్మిశెట్టి రాంబాబు, అక్కమ్మ, అంజమ్మ, చిన్నబాబు, వేముల లక్ష్మి పాల్గొన్నారు.

చెన్నారెడ్డి విరచిత 'స్వప్న సాగరం' నవల ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ గంగాధరరావు, రత్నషీలామణి

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగంలో ఆచార్యునిగా సేవలందిస్తున్న ప్రముఖ రచయిత ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి రచించిన 'స్వప్న సాగరం' నవలను వీసీ ఆచార్య కంచర్ల గంగాధరరావు ఆవిష్కరించారు. వర్సిటీలో మంగళవారం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. తొలిప్రతులను వర్సిటీ రెక్టార్ కే రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల ప్రాచార్యులు ఎం.సురేష్ కుమార్‌లకు అందించారు. వీసీ గంగాధరరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సర్వీస్ కమిషన్ గ్రూప్ వన్ ఉద్యోగాన్ని కాదని వర్సిటీలో ఆచార్యునిగా సేవలందిస్తూ తన రచనలతో సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్న గుజ్జు చెన్నారెడ్డి సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. నేటి యువత పుస్తక పఠనాన్ని అలవర్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. చెన్నారెడ్డి రచనలు అందుకు ఎంతగానో దోహదం చేస్తాయని సూచించారు. రెక్టార్ రత్నషీలామణి మాట్లాడుతూ చెన్నారెడ్డి సాహిత్య రంగంలో చేస్తున్న రచనలు చారిత్రక పరిశోధనాత్మకంగా సాగుతూ వర్తమాన పరిస్థితులపై భవిష్య దిక్సూచిగా ఉంటాయని ప్రశంసించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ చెన్నారెడ్డి ఇప్పటికే 215 పరిశోధక వ్యాసాలు రాసి తన ఆధ్వర్యంలో 42 డాక్టరేట్లను పూర్తి చేయించారన్నారు. ఆచార్య ఎం.సురేష్ కుమార్ మాట్లాడుతూ 'సిక్కోలు కథలు', 'మరో మహాత్మ', 'లండన్ టు అమరావతి' కాగా మూడవ నవల 'స్వప్న సాగరం' రచించారని తెలిపారు. రచయిత చెన్నారెడ్డి మాట్లాడుతూ విశాఖపట్టణంలో రవి సాగర్ అనే బీఏ చివరి సంవత్సరం విద్యార్థి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తన సహచర విద్యార్థులతో ఉన్న స్మృతులను చెప్పడమే ఈ స్వప్న సాగరం నవల నేపథ్యమని వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ ఏఈ కృష్ణ, డాక్టర్ బసవేశ్వరరావు, డాక్టర్ అచ్చిబాబు పాల్గొన్నారు.

చెత్త వ్యర్థాలు తొలగింపు



పట్టాభిపురం పోలీస్ స్టేషన్ రోడ్‌లో చెత్తను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూ నగర్: నగరంలో పలు ప్రాంతాల్లో చెత్తను సకాలంలో డంపింగ్ యార్డులకు తరలించకపోవడంతో వీధుల వెంట చెత్త కుప్పలు కుప్పలుగా పెరుగుతుంది. దీనిపై మంగళవారం 'సాక్షి' దినపత్రికలో స్వచ్ఛ సర్వేక్షణ్.. చెత్త లెక్క అనే కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కమిషనర్ మంగళవారం ఉదయం వివిధ ప్రాంతాలను పరిశీలించారు. చెత్తను సకాలంలో తరలించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు.



మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనం

రైతాంగ సమస్యలపై పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

లక్ష్మీపురం: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయంలో జిల్లా రైతు సంఘాల సమావేశం జొన్న శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. అజయ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో పంటలు పండినప్పటికీ గిట్టుబాటు ధరలు లేక పూర్తిగా నష్టపోతున్నారని విమర్శించారు. గత పది సంవత్సరాల కాలం నుంచి వ్యవసాయ రంగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు. శాస్త్రవేత్తలకి అంతుబట్టని రకరకాల వైరస్ వలన అధిక రసాయనాలు వాడవలసి వచ్చిందని, దీంతో పెట్టుబడులు పెరిగిపోవడం, దానికి తగ్గట్లుగా పంటలకు గిట్టుబాటు ధరలు లేకుండా పోయిందన్నారు. మిర్చి రైతులకు ఎకరాకు రూ.3 లక్షల వరకు ఖర్చు పెట్టగా వచ్చిన రాబడి కేవలం రూ.2 లక్షలు మాత్రమేనని వివరించారు. రూ.20 వేలు మిర్చికి గిట్టుబాటు ధర ప్రకటిస్తేనే రైతులు కొంత మేరకు ఆర్థికంగా పుంజుకుంటారన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ గుంటూరు చానెల్ పొడిగింపుపై నిధులు కేటాయించడం దాంట్లో సంఘం కృషి కూడా ఉంది అన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వల్లూరి భారతి, జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి, సంఘం జిల్లా నాయకులు చింతల భాస్కర రావు, ఏరువా అంజిరెడ్డి ఆదినారాయణ, గణేష్ సాంబశివరావు పాల్గొన్నారు.

పోరాటయోధురాలు అహల్యాబాయి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మంగళవారం సాయంత్రం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్(మహిళా విభాగం) ఆధ్వర్యంలో ప్రథమ స్వాతంత్ర్య సమరయోధురాలు అహల్యాబాయి జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. స్వాతంత్ర్య సమరయోధురాలు అహల్యాబాయి దేశభక్తి, పోరాట పటిమను సభాధ్యక్షులు డాక్టర్ తూనుగుంట్ల రాధాబాయి వివరించారు. కార్యదర్శి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి వాల్మీకి రామాయణం సుందరకాండలోని త్రిజట స్వప్నం – విశిష్టతపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఇటీవల కళారత్న పురస్కారం అందుకున్న దేవాలయ పాలకవర్గం అధ్యక్షులు మస్తానయ్యను సత్కరించారు. కార్యక్రమంలో సి.హనుమాయమ్మ, కోశాధికారి డాక్టర్ మైలవరపు లలితకుమారి, సభ్యులు డాక్టర్ మాధవపెద్ది విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎల్ఎల్ఎం కోర్సుల నిలిపివేయడం తగదు



ఏఎన్‌యూ: దశాబ్దాల చరిత్ర కలిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం న్యాయ విభాగం ద్వారా ఎందరో పేద విద్యార్థులు న్యాయ శాస్త్రం అభ్యసించి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థాయి చేరుకున్న ఘనత ఉన్న విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్ఎంలో కొన్ని కోర్సులను నిలిపివేయడం సరైంది కాదని పీజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ పరిరక్షణ జేఏసీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం యూనివర్సిటీ వీసీ చాంబర్ వద్ద నిరసన తెలియజేశారు. విద్యార్థుల భవిష్యత్తును సమాధి చేయటం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో లా కోర్సులతో ముందుకు దూసుకుపోతుంటే, విశ్వవిద్యాలయం దానికి విరుద్ధంగా పయనిస్తూ కోర్సుల ఎత్తివేతకు కారణమవుతోందని ఆరోపించారు. జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలను నెలకొల్పుతున్న కేంద్రంతో పాటు, ఆయా డీమ్డ్ యూనివర్సిటీలు ఎప్పటికప్పుడు పదుల సంఖ్యలో న్యాయ విద్యకు సంబంధించి పీజీ కోర్సులను రూపొందించి శిక్షణ అందిస్తున్నాయన్నారు. వందల సంఖ్యలో సర్టిఫికెట్ కోర్సులు సృష్టిస్తూ మార్కెట్లో విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని వెల్లడించారు. ఆయా సంస్థలు కోట్లాది రూపాయల ఆదాయాన్ని కూడా గడించే సంగతి సంబంధిత అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. న్యాయవిభాగాన్ని బలోపేతం చేసేలాగా తద్వారా పేద, గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్‌లకు సన్మానం



నగరంపాలెం: జిల్లా పీజీఆర్ఎస్ సీఐ కామినేని శ్రీనివాసరావు, లాలాపేట పీఎస్ ఎస్ఐ కోడూరు శ్రీనివాసరావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గల్లా శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు మంగళవారం నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో వారిని సత్కరించారు. వారి సేవలను జిల్లా ఏఎస్పీ జీవీ రమణమూర్తి (పరిపాలన) కొనియాడారు. కార్యక్రమంలో డీఎస్పీలు రమేష్(ట్రాఫిక్), ఏడుకొండలరెడ్డి(ఏఆర్), వెల్ఫేర్ ఆర్ఐ శివరామకృష్ణ, రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దళవాయి సుబ్రహ్మణ్యం, జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మయ్య, కరిముల్లా పాల్గొన్నారు.

ఐరన్ ముఠా కార్మికుల సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా చిన్న ఆంజనేయులు

లక్ష్మీపురం: గుంటూరు నగరంలోని ఐరన్ షాపుల్లో పనిచేస్తున్న ముఠా కార్మికుల కూలి రేట్ల అగ్రిమెంట్ కాలపరిమితి ముగిసినప్పటికీ కొత్త అగ్రిమెంట్ చేసి అమలు చేయటానికి యజమాన్యం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ హమాలీ (ముఠా) ఫెడరేషన్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన్న ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నగర ముఠా కార్మిక సంఘం కార్యాలయం రేగుల రాఘవయ్య భవనంలో నగర ఐరన్ ముఠా వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం యూనియన్ నగర అధ్యక్షులు పప్పుల రోసి రెడ్డి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి ముఠా కార్మికులు మంగళవారం నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నగర ముఠా కార్మిక సంఘం అధ్యక్షులు జి.సురేష్ బాబు, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఐరన్ ముఠా యూనియన్ నాయకులు మల్లె బోయినపిచ్చయ్య, ఆదం, శీను, సత్యం, కొంగలి కోటయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

24న మంత్రులకు సామూహిక రాయబారం కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ

లక్ష్మీపురం: భవన నిర్మాణ సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలని కోరుతూ ఏప్రిల్ 24వ తేదీన మంత్రులకు సామూహిక రాయబారం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం బి.సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే భవన్ నిర్మాణ సంక్షేమం బోర్డును పునరుద్ధరించి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్ష పోరాటాలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసరావు, బాబూరావు, సహాయ కార్యదర్శి దీవెనరావు, ఎస్ కే బాషా, విమల్ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై విచారణ జరిపించాలి



జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నెహ్రూ నగర్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపేందుకు రిటైర్డ్ జడ్జిలతో జ్యూడీషియల్ ఎంక్వయిరీ చేయించాలని సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజేంద్ర బాబు విన్నవించారు. కలెక్టరేట్ వద్ద నేషనల్ దళిత క్రిస్టియన్ వాచ్, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ, రాష్ట్రీయ మహా జన సమితి, తదితర క్రైస్తవ దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. తదనంతరం నాలుగు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా గోళ్ళమూడి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న తంతు అంతా ప్రవీణ్ పగడాల హత్య జరగలేదని కేవలం తాగిన మైకంలోనే ఆయన యాక్సిడెంట్ గురై ప్రాణాలు కోల్పోయాడనే ప్రజలకు నమ్మబలికే వ్యవహారం నడుస్తుందన్నారు. నేషనల్ దళిత్ క్రిస్టియన్ వాచ్ జాతీయ నాయకురాలు గద్దె రత్నశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న దళితులు క్రైస్తవులు అందరూ కూడా కలిసి ఒక తాటి మీదకు వచ్చి పోరాలని కోరారు. క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మేద్దు ప్రేమ జ్యోతి బాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని క్రైస్తవులు, దళిత క్రైస్తవులు, దళితులు అందరూ ఏకమై, రాజ్యాంగబద్ధమైన హక్కుల కోసం వాటి పునరుద్ధరణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో కార్పొరేటర్ రాజా లతా, ఏఈఎల్‌సీ నాయకులు జె.రవికాంత్, ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్, ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చి నాయకులు రవికాంత్ పాల్గొన్నారు.

నగరంలో ప్రమాదాలు అరికట్టే దిశగా చర్యలు



బ్లాక్ స్పాట్ ప్రాంతాలు పరిశీలిస్తున్న ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ రమేష్ తదితరులు

పట్నంబజారు: నగరంలో ప్రమాదాలు అరికట్టే దిశగా ముందుకు సాగాలని జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) జి.వి.రమణమూర్తి సూచించారు. గుంటూరు నగరంలోని చుట్టుగుంట, పట్టాభిపురం, గుజ్జనగుండ్ల సెంటర్, నవభారత్‌నగర్ ప్రధాన రహదారుల్లో గుర్తించిన బ్లాక్ స్పాట్‌లను నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్‌తో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఏఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ ప్రమాద ప్రాంతాలను డ్రోన్ కెమెరా సహాయంతో పరిశీలించడంతో పాటు, స్పీడ్ బ్రేకర్లు, డివైడర్లు, సీసీ కెమెరాలు స్టాఫ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయంలో వాహనచోదకులకు కనిపించేలా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు సింగయ్య, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

- ఆర్ఎం రవికాంత్
- 19వ బ్యాచ్ డ్రైవర్లకు శిక్షణ ప్రారంభం



పట్నంబజారు: డ్రైవర్లు బాధ్యతతో ప్రయాణికుల సంరక్షణే ధ్యేయంగా ముందుకు సాగాలని ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎం.రవికాంత్ చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం గుంటూరు జిల్లా పరిధిలోని ఏపీఎస్ ఆర్టీసీ హెవీ మోటారు డ్రైవింగ్ వెహికల్ స్కూల్ 19 బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆర్ఎం రవికాంత్ మాట్లాడుతూ హెవీ మోటారు డ్రైవింగ్ స్కూల్ ద్వారా 25 సంవత్సరాల అనుభవం కలిగిన సీనియర్ డ్రైవర్లతో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. శిక్షణ పొందిన ప్రతి అభ్యర్థి రోడ్డు నియమాలు కచ్చితంగా పాటిస్తూ, మత్తు పానీయాలకు దూరంగా ఉంటూ, ఇంధనం పొదుపు చేసే విధంగా డ్రైవింగ్ నేర్చుకోవాలని సూచించారు. ప్రమాద రహిత డ్రైవింగ్ లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. నిత్యం గంట పాటు బస్సుకు సంబంధించిన పలు విభాగాల పనితీరు గురించి వివరించడంతో పాటు ప్రమాద హెచ్చరికలు, సిగ్నల్స్ వివరాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 20వ బ్యాచ్ ప్రవేశాల కోసం డ్రైవర్లు వారి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 8897371003కి సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

వైద్య పరికరాల వితరణ



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 1999 బ్యాచ్ విద్యార్థులు గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్య విభాగానికి రూ.1.50 లక్షల వైద్య పరికరాలు అందజేశారు. ఆర్థోపెడిక్ వైద్య విభాగం నుంచి రూ. లక్ష విలువైన పరికరాలను కొనుగోలు చేసి థియేటర్‌లో అమర్చారు. మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ నూతన వైద్య పరికరాలు, ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ వైద్య పరికరాలతోపాటు, ఆపరేషన్ థియేటర్‌లో మౌలిక వసతులను ఏర్పాటు చేశామన్నారు. రోడ్ యాక్సిడెంట్, ట్రామా వైద్య సేవల కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు, బాధితులకు 24 గంటలు, 365 రోజుల ఆపరేషన్ థియేటర్ అందుబాటులో ఉండేలా ఆర్థోపెడిక్ ట్రామా ప్రత్యేక ఆపరేషన్ థియేటర్‌ని సిద్ధం చేసినట్లు వివరించారు. బుధవారం నుంచి ఆపరేషన్ థియేటర్ స్టెరిలైజేషన్ పూర్తిచేసుకుని రోగులకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో 1999 బ్యాచ్ జీఎంసీ స్టూడెంట్స్, ఆర్థోపెడిక్ ఫ్యాకల్టీ, ఆర్థోపెడిక్ విభాగధిపతి డాక్టర్ వి.వి.నారాయణరావు, మత్తు విభాగధిపతి డాక్టర్ పోలయ్య, ఎన్టీఆర్ వైద్య సేవ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్, యూకేకు చెందిన డాక్టర్ కొండమూరు ప్రీతీమ్ పాల్గొన్నారు.

